# భరతమాత ధర్మభాగ్యమును కాపాడే బాధ్యత మీదే!

ఖండఖండాంతర ఖ్యాతి నార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమర భూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరతభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి చూపిన దివ్యభూమి
చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి
భరతభూమియందు జననమొంది
భరతమాత ధర్మభాగ్యంబు కాపాడ
బాధ్యతంతయు మీదె బాలులార!
ఈ బాధ్యతంతయు మీదె బాలికలార!

భారతదేశము గొప్ప ప్రఖ్యాతి గాంచినటువంటి భాగ్యభూమి; మహా ప్రసిద్ధి గాంచిన పతివ్రతామతల్లులకు జన్మభూమి. మరణించిన తన పతి సత్యవంతుణ్ని బ్రతికించుకొన్నటువంటి మహా పతివ్రత, సావిత్రి. అట్టి సాధ్వీమణులు లోకంలో మరెక్కడైనా ఉన్నారా?

srisathyasaivacharanamrutam

**గతజీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి**

**సావిత్రి భారత సతియె కాదె!**

**తన సత్య మహిమచే దావాగ్ని చల్లార్చె**

**చంద్రమతి పవిత్ర పడతి కాదె!**

**కులసతీత్వమునకై గుండాన దూకిన**

**సీత భారత ధరాజాత కాదె!**

**కినిసి దుర్మద కిరాతుని బూది గావించె**

**తదమయంతి భారత రమణి కాదె!**

**సప్త సాగర పరివేష్టితోర్వితలము**

**భరత జాతి పాతివ్రత్య ప్రవిమలంబు**

**భావసంపదకిది మహా పంటభూమి**

**అఖిల దేశాలకిది ఉపాధ్యాయి కాదె!**

ఇంతటి శక్తిసామర్థ్యములు కలిగిన భారతీయులు ఈనాడు అల్పమైన విషయాలకు లొంగిపోతున్నారు. భారతీయులయొక్క దృష్టి చెడిపోయింది; వారియొక్క శ్రవణమూ, నడతకూడను విషమయమైపోయినవి. తత్ఫలితంగా భారతీయులు తమయొక్క భాగ్యమును కోల్పోతున్నారు. "ఏనుగెట్టుల తన బలమెఱుగలేదో అట్టులైనారు మన భారతీయులు నేడు!" ఏనుగు తన తోకతో కొడితే తొమ్మిది అడుగుల దూరంలో పడతాడు, మానవుడు. అంతటి బలమైనటువంటి ఏనుగు కూడను మావటికి లొంగిపోయి అతను కూర్చోమంటే కూర్చుంటుంది, లేవమంటే లేస్తుంది. అదేరీతిగనే, ఈనాడు భారతీయులు తమయొక్క పవిత్రతనూ, శక్తి సామర్థ్యములనూ గుర్తించుకొనలేక బయటివారు చెప్పినట్లు విని వారికి బానిసలైపోతున్నారు.

**సత్యధర్మములే భారతీయులయొక్క ఆస్తి**

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలతో ఆవిర్భవించినటు వంటివారు భారతీయులు. నిజంగా

sri sathyasai vachanamrutam

భారతీయులను జయించగలవారు జగత్తునందే కానరారు. “సత్యం వద, ధర్మం చర” అన్నదే భారతీయ సంస్కృతియొక్క ప్రధానమైన బోధ. సత్య ధర్మములే భారతీయులయొక్క ఆస్తి. కాని, ఈనాడు భారతీయులు సత్య ధర్మములను మరచిపోయారు. “సత్యం వధ, ధర్మం చెఱ” – ఈరకమైనటువంటి మార్గమును అనుసరించడంచేత భారతీయులు బానిసలైపోయారు. ప్రతి ఒక్కరుకూడను ‘నేను ఎవరు?’ అని ప్రశ్నించుకొని, ‘నేను జంతువును కాను, మృగమును కాను; నేను మానవుడను,’ అని తనకు తాను గుర్తు చేసుకోవాలి. ‘నేను మానవుడను’ అని అనుకున్నప్పుడు తనయందు మానవతా గుణములుండాలి. ఏమిటవి? మొదటిది సత్యము. “సత్యాన్నాస్తి పరో ధర్మః”, ఈ సత్యమునుండి ఆవిర్భవించినటువంటిదే ధర్మము. ఈ రెండింటినీ పురస్కరించుకొనియే శాంతి, ప్రేమ మనలో ప్రకాశిస్తూ వస్తాయి. ప్రేమ ఎక్కడ ఉన్నదో అక్కడ ద్వేషము, అసూయ ఉండవు. కాని, ఈనాడు మానవునిలో ఆ ప్రేమ కనిపించకుండా పోయింది. మానవుడు సాటి మానవుణ్ని ప్రేమించడం లేదు. ఈనాడు భారత దేశము ఈ స్థితికి వచ్చిందంటే, దీనికి కారణం ఐకమత్యం లేకపోవడమే! ‘యూనిటీ’ ఉన్నప్పుడే మనలో ‘ప్యూరిటీ’ అభివృద్ధి అవుతుంది. ‘ప్యూరిటీ’ అభివృద్ధి అయినప్పుడే ‘డివినిటీ’ ఆవిర్భవిస్తుంది. కనుక, ఈనాడు మనకు ప్రధానంగా ఉండవలసింది ‘యూనిటీ’.

**జీవిత సౌధమునకు ఆత్మవిశ్వాసమే పునాది**

ఈనాడు సైంటిస్టులు కావలసినన్ని విషయాలను కనిపెడుతున్నారు; ప్లేన్లను ఒకదానిపై ఒకటి పెట్టి ప్రయాణం చేయిస్తున్నారు. కాని, ఎన్ని మరణాలు సంభవిస్తున్నాయి! పూర్వం ఇలాంటివి ఏమీ లేవు. ఆరోజుల్లో ప్రజలు ఏమాత్రమూ భయం లేకుండా సుఖశాంతులతో జీవించేవారు. కాని, ఈనాడు చిన్నచిన్న విషయాలకుకూడా భయపడుతున్నారు. ఈ భయము ఎక్కడినుండి వచ్చింది? “నాయమాత్మా బలహీనేన లభ్యః”, మానవుడు ఆత్మబలమును కోల్పోవడమే ఇందుకు కారణం. ఈనాటి మానవునికి ఆత్మవిశ్వాసము లేదు. అన్నింటినీ విశ్వసిస్తున్నాడుగాని, ఆత్మను విశ్వసించలేకపోతున్నాడు. ‘సెల్ఫ్ కాన్ఫిడెన్సు’ (ఆత్మవిశ్వాసము) ఉండినప్పుడే ‘సెల్ఫ్ సేటిస్‌ఫేక్షన్’ (ఆత్మసంతృప్తి) కలుగుతుంది. ‘సెల్ఫ్ సేటిస్‌ఫేక్షన్’ వచ్చినప్పుడే ‘సెల్ఫ్ సేక్రిఫైజ్’ (స్వార్థత్యాగం) సాధ్య

మవుతుంది. 'సెల్ఫ్ సేక్రిఫైజ్' చేసినప్పుడే 'సెల్ఫ్ రియలైజేషన్' (ఆత్మసాక్షాత్కారం) కలుగుతుంది. కాబట్టి, 'సెల్ఫ్ రియలైజేషన్' కావాలంటే, 'సెల్ఫ్ కాన్ఫిడెన్సు' ఉండాలి. 'సెల్ఫ్ కాన్ఫిడెన్సు' - 'ఫౌండేషన్' (పునాది); 'సెల్ఫ్ సేటిస్‌ఫేక్షన్' - 'వాల్స్' (గోడలు); 'సెల్ఫ్ సేక్రిఫైజ్' - 'రూఫ్' (పైకప్పు); 'సెల్ఫ్ రియలైజేషన్' - 'లైఫ్' (జీవితం). పునాది భద్రంగా ఉంటే గోడలు భద్రంగా ఉంటాయి. గోడలు భద్రంగా ఉంటే 'రూఫ్' భద్రంగా నిలుస్తుంది. 'రూఫ్' భద్రంగా ఉండినప్పుడే ఆ ఇంటిలో నివాసం చేయవచ్చు. కాని, ఈనాడు పునాది భద్రంగా లేదు. ఇంక, గోడలు ఎట్లు నిలువగలవు!

**ఆత్మబలమే నిజమైన బలము**

ఈనాడు మానవత్వము భారతదేశమునందే అంతో ఇంతో నిలిచి ఉంది. కనుకనే, దేశము సుక్షేమంగా ఉన్నది. ఇతర దేశములవారికి అనేకవిధములైన బాధలు కలుగుతున్నాయి. "మనకు నిద్ర లేదు, ఆహారము లేదు. కాని, భారతీయులు సుఖంగా ఉన్నారే! చక్కగా భుజిస్తున్నారు, నిద్రిస్తున్నారు" అని ఇతర దేశములవారికి అసూయ కలుగుతున్నది. ఈనాడు మానవుడు తినే తిండి, త్రాగే నీరు, పీల్చే గాలి కలుషితమైపోయినవి. సైన్సుయొక్క దుర్వినియోగమే ఇందుకు కారణం. కనుక, మనము సైన్సు పేరుతో విచక్షణారహితంగా ప్రవర్తించకూడదు. మానవత్వములో ఉన్నటువంటి బలమును మనము ఉపయోగించుకొని కాలమును సార్థకం చేసుకోవాలి. మానవత్వములో ఉన్నటువంటి శక్తికంటే మించినది మరొకటి ఎక్కడా లేదు. భగవంతుడంటే ఎవరు? ఎక్కడున్నాడు? మానవుడే భగవంతుడు. "చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయత." ఆత్మబలమే మనకు నిజమైన బలము. ఆత్మకంటే మించినటు వంటిది మరొకటి లేదు.

**చదువులన్నియు చదివి చాల వివేకియై**
**మదిని తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతి ఉన్నను**
**హీనుడవగుణంబు మానలేడు**

sri sathyasaivachanamrutam

తరచి చదువు చదువ తర్కవాదమెగాని
పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు
చదువులన్ని చదివి చావంగనేటికి?
చావు లేని చదువు చదువవలయు

ఈనాటి చదువులు కేవలం డబ్బు సంపాదించుకోవడానికి, కుటుంబాన్ని పోషించుకోడానికి ఉపయోగపడుతున్నాయేగాని, నిజమైన జ్ఞానాన్ని అందించడం లేదు. సంపాదించిన డబ్బునుకూడా దుర్వినియోగం చేస్తున్నారు. ఈనాటి తల్లిదండ్రులు చిన్నచిన్న పిల్లలని ఫారిన్‌కి పంపుతున్నారు. అక్కడ లేనిపోనివాటి కోసం లక్షలు ఖర్చుపెడుతున్నారు. చివరికి చెడిపోయి అక్కడినుండి తిరిగి వస్తున్నారు, పిల్లలు.

ఒక స్టూడెంటును అతని తల్లిదండ్రులు అమెరికా పంపేముందర ఒక దేవీ ఆలయానికి తీసికొని వెళ్ళారు. "నాయనా! సర్వులకు మాత అయినటువంటి ఈ 'డివైన్ మదర్'ను నీవు ఎన్నడూ మరువవద్దు. నిరంతరం ఈ జగన్మాతను తలుచుకుంటూ ఉండు" అని చెప్పి, ఆమేరకు అతని దగ్గరనుండి వాళ్ళు 'ప్రామిస్' తీసుకున్నారు. కాని, అమెరికాలో అడుగు పెట్టిన తరువాత వాడు తన 'మదర్'ను కూడా మరచిపోయాడు. కొన్ని సంవత్సరముల తరువాత వాడు భారతదేశానికి వచ్చినప్పుడు తల్లిదండ్రులు వానిని ఏరోడ్రమ్ నుండి నేరుగా దేవీ ఆలయానికి తీసుకువెళ్ళారు. గర్భగుడిలోకి ప్రవేశిస్తూనే వాడు 'డివైన్ మదర్'కు నమస్కారం చేసే బదులు 'హౌ ఆర్ యు మేడమ్?' అన్నాడు. తల్లిదండ్రులకు పట్టలేనంత కోపం వచ్చింది. "ఇంత డబ్బు ఖర్చు పెట్టి నిన్ను అమెరికా పంపిస్తే, నీవు దైవాన్ని కూడా తలచడం లేదే! ఇదా అక్కడికి పోయి నీవు నేర్చుకున్నది!" అని వానిని గట్టిగా మందలించారు.

**భారతదేశములో ఉన్నటువంటి భాగ్యము మరి ఏ దేశములోనూ చిక్కదు**

విదేశాలకు పోయివచ్చినవారిలో అనేకమంది దుర్బుద్ధులు, దురాలోచనలు, దుశ్చింతనలు నేర్చుకొని వస్తున్నారు. కనుక, ఇకపైన ఎవ్వరూ తమ బిడ్డలను విదేశాలకు పంపకూడదు. మన భారతదేశంలో ఉన్నటువంటి భాగ్యము విదేశాలలో ఎంత వెదికినా



sri sathyasaivachanamrutam

దొరకదు. కనుక, మనము విదేశాలకు పోనక్కర్లేదు. భారతీయులయొక్క భాగ్యము ఇట్టిది, అట్టిది అని వర్ణించటానికి వీలుకాదు. ఇట్టి భాగ్యవంతమైనటువంటి భారతదేశములో పుట్టి, భారతీయులని పేరు పెట్టుకొని విదేశాలపై మోజుతో భారతీయ సంస్కృతిని విస్మరిస్తే ప్రయోజనమేమిటి? మనం మొట్టమొదట ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విలువలను పోషించుకోవాలి. కాని, ఈనాడు నైతిక విలువలు క్షీణించిపోయాయి. నైతిక విలువలు లేని మానవుడు తన జీవితంలో ఎన్నో బాధలకు గురి కావలసివస్తుంది. భారతదేశములో ఉన్నటువంటి భాగ్యము మరి ఏ దేశములోకూడను మనకు చిక్కదు. నన్ను ఎంతమందో తమతమ దేశాలకు రావలసిందిగా ప్రార్థిస్తున్నారు. స్పెషల్ ప్లేను తెస్తామని అంటున్నారు. కాని, నాకు ఏ ప్లేనూ వద్దు. నాకిక్కడే ఇండియాలోనే ఆనందం. నాకు ఆ ప్లేన్లూ, ఆ సుఖములూ అక్కర్లేదు. 'ఐ వాంట్ ఓన్లీ డివోషన్!'

**"అపకారికి ఉపకారము నెపమెన్నక చేయు నేర్పరి - సాయి"**

నాకు ద్వేషులనేటటువంటివారే లేరు. ఎవరూ నాకు విరోధులు కారు. అందరూ నాకు ప్రీతిపాత్రులే! అందరినీ నేను ప్రేమిస్తున్నాను. కాని, ఆ ప్రేమను మీరు సరిగా అర్థం చేసుకోవడం లేదు. కొంతమంది 'ఆ ప్రేమను నేను పొందలేదే' అని భావిస్తారు. 'నేను కోరినది స్వామి నాకివ్వలేదే' అని ద్వేషముకూడను పెంచుకుంటారు. కాని, వారు కోరినవన్నీ ఇస్తే వారు బాగుపడతారా? లేదు, చెడిపోతారు. అందుకోసమే, పిల్లలకు తగినటువంటి నియమాలను నిర్దేశించి వారికి చక్కని శిక్షణ ఇస్తున్నాను. మా కాలేజిలో చూడండి, అందరూ 'స్వామి, స్వామి, స్వామి' అని ఎంతో ప్రేమగా స్వామిచెంతకు వస్తుంటారు. స్వామిని వదలివెళ్ళే సమయంలో కంటిధారలు కారుస్తారు. బయటితట్టు చూస్తే కళాశాలలు నిజంగా కళాశాలలుగా ఉన్నాయా? ఆ విద్యార్థులు తమ అమ్మా నాన్నలనుకూడా గౌరవంగా చూడరు. మాతాపితరులు దైవస్వరూపులు. 'మాతృదేవో భవ, పితృదేవో భవ', తల్లి దైవమే! తండ్రి దైవమే! స్నేహితుడు దైవమే! ఈ ప్రపంచంలో ఉన్నవారందరూ దైవస్వరూపులే! అన్నీ భగవత్స్వరూపములే! ఈ సత్యాన్ని మనము తెలుసుకోకుండా ఒకరిని మిత్రునిగా, ఒకరిని శత్రువుగా భావిస్తున్నాము. "వీడు నా విరోధి, వీడు నా శత్రువు, వీడు నన్ను కష్టపెట్టిన

sri sathyasai vachanamrutam

వాడు" అని ఎవరినైనా మనం ద్వేషంతో చూస్తే, మనకు వానిలో ద్వేషమే కనిపిస్తుంది. 'యద్భావం తద్భవతి'. మన భావం ఎట్టిదో అలాంటి ఫలితమే వస్తుంది. ఉపకారం చేసినవారికి తిరిగి ఉపకారం చేయడంలో గొప్పతనమేమీ లేదు. అపకారికికూడను మనం ఉపకారం చేయాలి. 'అపకారికి ఉపకారము నెపమెన్నక చేయు నేర్పరి - సాయి.' మనకు చెడు చేసినటువంటివాణ్ణికూడను మనము మంచిగా చూసుకోవాలి. అదే నిజమైన మనిషియొక్క లక్షణము.

**ఎదుటి వ్యక్తిలో నిన్ను నీవు చూసుకో!**

ఎవరిని చూసినా దైవముగానే చూడాలి. 'దైవం మానుష రూపేణ'. మనుష్య రూపంలో ఉన్నాడు, భగవంతుడు. ఏ ఫోటోనైనా మీరు చూడండి, భగవంతుడు మనిషి రూపంలోనే ఉంటాడు. రాముని వేషం వేసేదీ మనిషే! సీత వేషం వేసేదీ మనిషే! అందరూ ఆత్మస్వరూపులే! దేహాన్ని పురస్కరించుకొని సంబంధ బాంధవ్యములు, పేర్లు వేరువేరుగా ఉంటున్నాయిగాని, అందరియందున్న ఆత్మతత్త్వము ఒక్కటే. "ఏకాత్మా సర్వభూతాంతరాత్మా". ఇట్టి ఏకాత్మ భావాన్ని మనము చిన్నప్పటినుంచి పెంచుకుంటూ రావాలి. లేతవయస్సునుండియే అట్టి సమత్వమును పోషించుకోవడం చాలా అవసరము. అది కష్టమని మీరనుకుంటారు. కాని, దానికంటే సుఖప్రదమైనది మరొకటి లేదు. నీవు విరోధిగా భావించే వ్యక్తి నీకు ఎదురైతే నమస్కారం చేసి, 'హౌ ఆర్ యు బ్రదర్?' అని అడుగు. అతనుకూడా 'హౌ ఆర్ యు బ్రదర్?' అంటాడు. కారణమేమిటి? నీవతనిని 'బ్రదర్!' అనటం వల్ల అతనుకూడా నిన్ను 'బ్రదర్'లాగే చూస్తాడు. నీయొక్క భావమునుబట్టి, భాషనుబట్టి ఎదుటి వ్యక్తికి నీపట్ల విరోధముగాని, లేక విశ్వాసముగాని అభివృద్ధి అవుతాయి. నీవు అందరియందుకూడను ఏకాత్మ తత్త్వమును చూడాలి. దేహములు వేరువేరు, మనసులు వేరువేరు, బుద్ధులు వేరువేరు, చిత్తములు వేరువేరు. కాని, ఆత్మతత్త్వము ఒక్కటే. అట్టి ఏకాత్మ తత్త్వమును అందరియందు నీవు చూడగల్గినప్పుడు నీవుకూడను దైవ స్వరూపుడవైపోతావు. దేహాలన్నీ అద్దాలవంటివి. "ఈ అద్దాలలో నన్ను నేనే చూసుకుంటున్నాను. ఇవన్నీ నాయొక్క ప్రతిబింబాలే" అని నీవు భావించాలి. ఎవరిని

sri sathyasaivachanamrutam

చూసినా 'అద్దం'లో నిన్ను నీవు చూసుకుంటున్నట్లుగా భావించాలి. అప్పుడే నీకు శాంతి కలుగుతుంది. అట్టి ఏకాత్మభావము లేకుండా జపములూ, తపములూ, యోగములూ, యజ్ఞములూ, యాగములూ ఎన్ని చేసినప్పటికీ నీకు శాంతి కలుగదు. Peace (శాంతి) కావాలని అనేకచోట్లకు తిరుగుతుంటావు. కాని, ఈ ప్రపంచంలో నీకు pieces కనిపిస్తుంటాయి తప్ప peace అనేది ఎక్కడా కనిపించదు. శాంతి నీలోనే ఉన్నది. కాబట్టి, నీ దృష్టిని అంతర్ముఖం చేసుకో! అప్పుడే నీవు మనిషివి అవుతావు. పశువులకూ, క్రూరమృగములకూ ఆ బుద్ధి లేదు. నీవు పశువు కాదు, మృగానివి కాదు; నీవు మనిషివి. కాబట్టి, నీవు మనిషిగా జీవించు. 'మనిషి' అని పేరు పెట్టుకొని మృగంగా జీవిస్తే, నీవు మనిషివి ఎట్లవుతావు? 'నేను మానవుడను' అని నీవనుకున్నప్పుడు మానవునిగా నీవు బ్రతకాలి.

**మీ ఆనందమే నా ఆనందము**

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు మృగ లక్షణాలు. మనిషి తన సాటి మనిషితో మనిషిగా మెలగాలి. ఎవరినీ ద్వేషించకూడదు. నాకు ఎవరిపైనా ఎట్టి క్రోధమూ లేదు, ద్వేషమూ లేదు. అందువల్లనే అందరూ నన్ను ప్రేమిస్తున్నారు. నాయందున్నది ప్రేమ ఒక్కటే! కనుకనే, నేను కారడవిలో ఉన్నప్పటికీ అందరూ అక్కడికి వస్తుంటారు; నేను బజారులో పోతున్నా అంగడిలో ఉన్నవారు బయటికి వస్తారు. దీనికి కారణమేమిటి? ప్రేమనే! అందరినీ నాదగ్గరకు చేర్చేది నా ప్రేమనే! నాపైనకూడను కొంతమందికి ద్వేషం వస్తుంది. అయితే, దానికి కారణం వాళ్ళవాళ్ళ 'ఇమేజినేషన్' తప్ప నా దోషం కాదు. "స్వామి ఇంతమందిని చూస్తుంటాడే! అయినా ఇంత శాంతంగా ఉంటాడే" అని మీరు అనుకుంటారు. శాంతమే నా సహజ స్వభావం. నాకు 'కేస్ట్రాయిల్ ఫేస్' ఎప్పుడూ రాదు. నేనెప్పుడూ చిరునవ్వులు చిందిస్తూనే ఉంటాను. నాకెప్పుడూ ఆనందమే! మిమ్మల్నికూడను ఆనందంగానే ఉండమని చెపుతున్నాను. మీరంతా ఆనందంగా ఉన్నప్పుడు అదే నాకు గొప్ప ఆనందము. మీ ఆనందమే నా ఆనందము. కనుకనే, నన్నందరూ ప్రేమిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా నాపై ద్వేషమును పెంచుకుంటే, అది వారియొక్క దోషమేకాని, నా దోషం

sri sathyasai vachanamrutam

కాదు. ఇంతమందికి ప్రేమకు నేను పాత్రుడనైనానంటే దీనికి కారణమేమిటి? మీకేమైనా నేను ఇన్విటేషన్ పంపించానా? మీ ప్రేమనే మిమ్మల్ని ఇక్కడికి లాక్కుంటూ వచ్చింది. నా ప్రేమయే మీకు ఇన్విటేషన్! "ప్రేమయే దైవం, ప్రేమలో జీవించండి." ఈ పవిత్రమైన దినమున ఇదే మీరు నేర్చుకోవలసింది.

**మనది ఒకే ఒక పార్టీ ... అదే ప్రేమ!**

కొన్ని దినములలోనే ప్రపంచమంతా ఒక్కటిగా మారిపోతుంది. 28 సం॥ల తరువాత ప్రపంచమంతా భారతదేశమవుతుంది. అందరూ 'భారతీయులం, భారతీయులం' అంటారు. 'నాది మద్రాసు స్టేటు', 'నాది కేరళ స్టేటు', 'నాది కర్ణాటక స్టేటు' అని ఎవరూ అనరు. భారతదేశములో కర్ణాటక ఒక రాష్ట్రము. అంతేగాని, భారతదేశము లేకుండా కర్ణాటక ఎక్కడినుండి వచ్చింది? తమిళనాడు ఎక్కడినుండి వచ్చింది? ఇవన్నీ 'పొలిటిక్స్' పెట్టుకున్నటువంటి 'లిమిట్స్'! కాబట్టి, ఏ దేశమునకు వెళ్ళినా 'నాది భారతదేశము. నేను భారతదేశమునుండి వచ్చాను' అని సగర్వంగా చెప్పుకోండి! మనకు ఏ పార్టీలూ వద్దు. మనది ఒకే ఒక పార్టీ ... ప్రేమ... ప్రేమ... ప్రేమ! ప్రేమను హృదయంలో పెట్టుకోండి; మీరు ఏ దేశమునకు వెళ్ళినా మిమ్మల్ని గౌరవిస్తారు; మీకు కావలసిన సహాయం చేస్తారు; మిమ్మల్ని సోదరులవలె, సోదరీమణులవలె చూచుకుంటారు. 'ప్రేమ' అనేది స్వార్థరహితమైనది. మనిషిలో స్వార్థమనేది ఉండ కూడదు. స్వార్థము, కోపము, ద్వేషము మొదలైనవి మనిషి తనకు తానే పెంచుకుంటున్నాడుగాని, భగవంతుడు ఇచ్చినవి కావు.

**స్వామి ఆదర్శాన్ని అనుసరించి ధన్యులు కండి!**

భగవంతుడు అందరికీ ప్రేమ నొక్కటే సమానంగా ఇచ్చాడు. ఏది లేకపోయినా మనిషికి ప్రేమ అనేది శాశ్వతంగా ఉంటుంది. ప్రేమకంటే మించిన బలము లేదు. ప్రేమవలన కలిగే ధైర్యమూ, సాహసమూ సాటి లేనివి. సీతమ్మవారు లంకలో పది నెలలు ఉన్న సమయంలో పలువురు రాక్షస స్త్రీలు కత్తులు పట్టుకొని తన చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఆమె ఏమాత్రము భయపడకుండా నిరంతరము 'రామా, రామా' అని స్మరిస్తూ వచ్చింది. కనుకనే, పదినెలలు ఉండినప్పటికీ సీతను ఎవరూ ముట్టలేకపోయారు. మనము రాముణ్ని ప్రేమిస్తే అందరూ

srisathyasaivachanamrutam

మనల్ని ప్రేమిస్తారు. అటువంటి ప్రేమను మనము పెంచుకోవాలి. ఆ ప్రేమనే మనకు సర్వమునూ అందిస్తుంది. అదే ఈనాడు మనము ప్రపంచమునకు బోధించవలసింది. అందరూ ప్రేమస్వరూపులు కావాలి. 'సమస్త లోకాస్సుఖినో భవంతు' అని మీరు ప్రార్థన చేయండి. మనము కోరవలసింది ఇదొక్కటే! అందరూ శాంతిని అనుభవిస్తారు. అందరూ సంతోషంగా ఉంటారు. నేను మిమ్మల్నందరినీ ప్రేమిస్తున్నాను. నాకెవ్వరూ ద్వేషులనేవారే లేరు. కాని, తప్పు చేసినవారిని సరిదిద్దే నిమిత్తం ఒక్కొక్కతూరి నేను కఠినంగా మాట్లాడతాను. అయితే, ఆ కఠినత్వం కేవలం మాటలయందే ఉంటుందిగాని, మనస్సునందు ఉండదు. కనుక, మీరు స్వామి ఆదర్శాన్ని అనుసరించి అందరినీ ప్రేమించినప్పుడు మీరు ధన్యులవుతారు, పుణ్యులవుతారు; మీ తల్లిదండ్రులనూ, సోదరులనూ, బంధుమిత్రులనూ సంతోషపెట్టినవారవుతారు.

**(తేదీ 22.11.2008, స్నాతకోత్సవం, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam